క్లుప్తంగా

భీమవరంలో బీఎస్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ



భీమవరంలో బీఎస్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ భీమారావు తదితరులు

భీమవరం: బుద్ధుని ధర్మాన్ని పాటించడం అభినందనీయమని అడిషనల్ ఎస్పీ వి. భీమారావు అన్నారు. గురువారం భీమవరం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ది బుద్ధిష్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీఎస్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ పుల్లారావు, వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు, ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి, ఎస్ఐలు రవికిరణ్, ఇబ్రాయిల్, బీఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనా జోషప్, జిల్లా ప్రెసిడెంట్ ఈది రవి కుమార్, జనరల్ సెక్రటరీ గాతల సందీప్, సెక్రటరీ కొల్లి శ్రీనివాస్, ట్రెజరర్ విపత్తి సత్యవేణి, కేసీ రాజు, ఎ వీరయ్య, గుంపుల జ్యోతి, గుండే నగేష్, గంటా సుందరకుమార్, మత్తే రాజ్‌కుమార్, క్రాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పార్లమెంట్‌లో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడు మైగాపుల నాగభూషణంనాయుడు కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను కోరారు. గురువారం భీమవరంలో బీజేపీ జిల్లా కార్యాలయంలో శ్రీనివాసవర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణంనాయుడు మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్స్ కమీషన్ తగ్గించడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నామని అలాగే ప్రీమియంపై జీఎస్టీ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి పీఆర్‌కే రాజు, కోశాధికారి టీఎల్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గొట్టుముక్కల శివరామరాజు

పాలకోడేరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ హేమ అన్నారు. పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల వెంకట శివ రామరాజు చేతుల మీదుగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ ఈ ఉచిత పశు వైద్య శిబిరాలు ఈ నెల 31 వరకు కొనసాగుతాయని, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహిస్తాన్నారు. ఈ శిబిరంలో 49 పశువులకు, 40 దూడలకు, 10 గొర్రెలకు, 400 కోళ్లకు వైద్య సేవలను అందించామని, అలాగే 25 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి చికిత్స అందించినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ హేమ తెలిపారు. ఈ శిబిరంలో ఎంపీటీసీ సభ్యులు వేగేశ్న పార్వతి కృష్ణకుమారి, బీజేపీ నాయకులు ఇంజేటి వెంకటేశ్వర్లు, వీఎల్‌డీ జయలక్ష్మి, నారం నాయుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి

భీమవరం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా భీమవరం ట్రాఫిక్ పోలీస్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణమూర్తి మాట్లాడుతూ బాలలు వాహనాలను డ్రైవింగ్ చేస్తూ ప్రమాదం జరిగితే వారితో పాటు వారిని ప్రోత్సహించిన కుటుంబసభ్యులు కూడా శిక్షార్హులు అవుతారన్నారు. విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 10 వరకు వివిధ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం పి శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ గగారిన్, స్కూల్ కోఆర్డినేటర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు మూణ్ణాళ్ల ముచ్చటే



జువ్వలపాలెం రాష్ట్ర రహదారిపై రాళ్లు పైకి లేచి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

- పది రోజులు గడవక ముందే రోడ్లపై లేచిన రాళ్లు
- దుమ్ముతో ఇబ్బందిపడుతున్నామని వాపోతున్న వాహనాదారులు

కాళ్ల: సంక్రాంతి సమయానికి గోతుల్లేని రహదారులంటూ హడావుడి చేస్తూ కూటమి ప్రభుత్వం పలు చోట్ల రోడ్లకు కేవలం మరమ్మతులతో సరిపెట్టింది. అయితే ఈ మరమ్మతులను సవ్యంగా చేయకపోవడంతో రాళ్లు పైకి లేచి దుమ్ముతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డు మరమ్మతులు మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలాయని పలువురు బహిరంగనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇటీవల చేపట్టిన రోడ్ల మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పది రోజులైనా పూర్తికాకముందే రోడ్లపై రాళ్లు పైకి లేచి రహదారులన్నీ మళ్లీ పాత పరిస్థితికి వచ్చాయని ప్రయాణికులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నాణ్యత పాటించకపోవడంతో పాటు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు మరమ్మతులు తూతూ మంత్రంగా చేస్తున్నారు. దీంతో రహదారులు మరలా పాత పరిస్థితి వచ్చి అధ్వానంగా మారుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మరమ్మతులు ఇలా

కాళ్ల మండలంలో పరిధిలో జువ్వలపాలెం రాష్ట్ర రహదారి పెదఅమిరం నుంచి జక్కరం రూ. 15 లక్షలు, జక్కరం నుంచి జువ్వలపాలెం వరకు రూ. 40 లక్షలతో మరమ్మతులు చేపట్టారని తెలుస్తోంది. అయితే రోడ్లపై ఏర్పడ్డ గోతుల్లో తారు వేయకుండా గ్రావెల్ వేసి వదిలేయడంతో మళ్లీ ఆ గోతులన్నీ యథాస్థితికి వస్తున్నాయి. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మాత్రం దానికి మరమ్మతులు చేయడం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు దుర్వినియోగం తప్ప ప్రయాణికులకు, వాహనదారులకు ఒరిగిందేమీ లేదని ప్రయాణికులు వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా పెదఅమిరం నుంచి ఏలూరుపాడు వరకు పలుచోట్ల రాళ్లు పైకి లేచి గోతులు యథాస్థితికి వచ్చిన పరిస్థితి ఉంది. మూణ్ణాళ్ల ముచ్చటగా వేసిన మరమ్మతులను పరిశీలించి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.దీనిపై ఆర్ అండ్‌బీ ఏఈ శ్రీహరిరాజును వివరణ కోరగా మరమ్మతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇబ్బందిగా ఉన్న చోటా మళ్లీ పనులు చేస్తామని స్పష్టం చేశారు.

తూడు తొలగింపు పనుల పరిశీలన

కాళ్ల: సుమారు 10 గ్రామాలకు సాగు త్రాగు నీరు అందించే బొండాడ పంట కాలువలో తూడు, చెత్త తొలగింపు పనులను చేపట్టినట్లు ఉండి వాటర్ డీసీ చైర్మన్ తోట ఫణిబాబు తెలిపారు. కూలీలతో చేపట్టిన తూడు, చెత్త తొలగింపు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈయన వెంట బొండాడ నీటిసంఘం అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

వృత్తివిద్యా కోర్సులపై శిక్షణ

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వృత్తి విద్య నైపుణ్యాన్ని సాధించేందుకు కంప్యూటర్ డేటా ఎంట్రీ, టైలరింగ్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది చేపట్టిన వృత్తి విద్యా కోర్సుల శిక్షణ పూర్తయ్యిందని, త్వరలోనే కొత్త కోర్సులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మూడు నెలల వ్యవధిలో శిక్షణ ఇచ్చే కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుకు టెన్త్, టైలరింగ్‌కు కనీసం ఐదో తరగతి చదివి ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారు 86885 94244 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

గాంధేయంపై కవితా రచనలకు 20 మందికి బహుమతులు

భీమవరం: మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన కవితా రచనలో 20 ఉత్తమ రచనలు ఎంపిక చేసినట్లు సర్వోదయ మండలి జిల్లా కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు గురువారం భీమవరంలో విలేకరులకు తెలిపారు. వీరికి ఈ నెల 30న బహుమతులు అందిస్తామన్నారు. కలిగొట్ల గోపాలశర్మ(భీమవరం), తేన్నేటి మాష్టారు(పాలకోడేరు), వేమూరి శ్రీనివాస్(తాడేపల్లిగూడెం), మీసాల సూర్యరాయణ(పెదఅమిరం), దేవరకొండ బాలసుబ్రహ్మణ్యం(ఉండి), కాళ్లకూరి సుబ్రహ్మణ్యశర్మ(గునుపూడి), యండవల్లి పాండురంగాచార్యులు(గణపవరం), శశికళ(అజ్జమూరు), గుండాల గీతామహాలక్ష్మి(ములపర్రు), చివటం సుబ్బారావు(పెనుగొండ), కొల్లాబత్తుల సూర్యకుమార్(పాలకొల్లు), ఏవీవీ మురళీధర్(ఏలూరు), పంపన సాయిబాబు(వీరవాసరం), దొంతాబత్తుని రామనాగేశ్వరరావు(భీమవరం), జి హనీ(భీమవరం), హైమావతిసత్య(వేల్పూరు), ఎస్ వెంకటేశ్వరరావు(తణుకు), చింతా రాంబాబు(కాట్రేనికోన), ఉజ్జిన కనకదుర్గ(తాడేపల్లిగూడెం), చర్ల మృదులకుమారి(మల్లవరం) విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు.

రజక జిల్లా సంక్షేమ కమిటీ ఏర్పాటు చేయాలి



జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

భీమవరం: జిల్లాలో రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో తక్షణమే రజక జిల్లా సంక్షేమ కమిటీ ఏర్పాటు చేయాలని రజక సంఘ నాయకులు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి భీమవరంలో గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి మడక రాజు మాట్లాడుతూ అనేక గ్రామాల్లో రజకుల వృత్తి చెరువులు ఆక్రమణలో ఉన్నాయని, జీవో 343 ప్రకారం తమకు వృత్తి చెరువులపై తమకు హక్కులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రజకులపై కులం పేరిట దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దోబి పోస్టులు రజకులకే కేటాయించి తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యండమూరి నాగేంద్ర, శివ, పాలవరపు అర్జునరావు, ఎర్రమల్ల సూర్యనారాయణ, దొడ్డిపట్ల అమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు సంఘాభివృద్ధికి ముల్లి సేవలు ప్రశంసనీయం



భీమవరంలో ముల్లి నర్సింహామూర్తి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: తూర్పుకాపు విద్యావిజ్ఞానాభివృద్ధి సంఘం అభివృద్ధికి, ఆర్ఎంపీ, పీఎంపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంక్షేమానికి ముల్లి నర్సింహామూర్తి చేసిన సేవలు ప్రసంశనీయమని జిల్లా తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు సరిపిడకల రామారావు అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో ఏర్పాటుచేసిన నర్సింహమూర్తి సంతాప సభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ యశోద హాస్పటల్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సారికి వెంకట్రావు మాట్లాడుతూ నర్సింహమూర్తి గత 45 ఏళ్లగా వైద్యవృత్తిలో సేవాదృక్పథంతో పనిచేశారని కొనియాడారు. ముందుగా నర్సింహమూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మెరగాని అప్పారావు, మెరగాని నారాయణమ్మ, మెరగాని బాబు, గంద్రెడ్డి త్రినాథ్, విజ్జురోతి రాఘవులు, మెంటే పార్థసారధి, చెనమల్ల చంద్రశేఖర్, తాళ్లపూడి గాంధీ, ఏకే నాయుడు, మీసాల సూర్యనారాయణ, కర్నేని రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

నారు కొరతకు వెదజల్లు పద్ధతితో చెక్



సిద్ధాపురం గ్రామంలో వెదజల్లిన రబీ పంట.

ఆకివీడు: ప్రస్తుతం దాళ్వా సాగులో నారు కొరతకు వెదజల్లు పద్ధతితో చెక్ పెట్టవచ్చని రైతులు చెబుతున్నారు. నాట్లు వేసేందుకు సమయం లేదని, ఈ సమయంలో నారు అందుబాటులో లేకపోవడంతో నారు కోసం తిప్పలు పడాల్సి వస్తుందంటున్నారు. పలు గ్రామాల్లో రబీ నాట్లు నేటికీ వేయలేదని, మండలంలో రబీ సాగు 4,750 ఎకరాల్లో చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకూ 4,200 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. మిగిలిన రైతులు వెదజల్లు పద్ధతితో నాట్లు వేసుకుంటే మెరుగైన దిగుబడి సాధించవచ్చని పేర్కొంటున్నారు. వెదజల్లడం వల్ల 20 రోజులు సమయం ఆదా అయ్యే అవకాశం ఉందని వివరిస్తున్నారు. మండలంలో అధిక శాతం రైతులు ఎంటీయూ 1121 అమ్మోరు రకం వంగడాన్ని సాగు చేశారు. ఆ తరువాత పీఆర్ 126 వంగడంతో పాటు, చౌడును తట్టుకునే వంగడాలను, ఖరీఫ్ విత్తనాల కోసం మరి కొన్ని వంగడాలను సాగు చేశారు. నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఓల్డ్ వయ్యేరు పరిధిలోని పలు మీడియం పంట కాల్వలు, బోదెల ద్వారా నీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉందని రైతులు వాపోతున్నారు.

యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్



ఆకివీడు: వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



భీమవరం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉండి: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: యువతకు స్ఫూర్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని పలువురు వక్తలు కొనియాడారు. భీమవరం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129 జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం సుభాష్ చంద్రబోస్ ఎనలేని కృషి చేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని నేతాజీ నూరు పోసిన దేశభక్తిని అందిపుచ్చుకొని ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేయాలని ఆయన సేవలను కొనియాడారు. నేతాజీ విద్యార్థి దశ నుంచి రాజకీయ ఉద్యమాల్లో పాల్గొని బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మధుబాబు, దండు శ్రీనివాసరాజు, వనమయ్య, వెంకటపతి రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతి సమైక్యతా స్ఫూర్తిని నింపుకోవాలి

ఆకివీడు: జాతి సమైక్యతా స్ఫూర్తి ప్రతి వ్యక్తిలోనూ నింపుకోవాలని, అదే మన సమరయోధులకు ఇచ్చే నివాళులని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోనూ, స్థానిక శాఖ గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుజాత సుభాష్ చంద్రబోస్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.ఆనంద కుమార్ పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు నేతాజీ సేవలకు సెల్యూట్ చేశారు.

ఉండిలో..

ఉండి: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాందువ్వలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూత్ వారి ఆధ్వర్యంలో పాఠశాలలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పెన్మెత్స వెంకట సత్యనారాయణ రాజు సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు విడుదల చేయాలి



యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

భీమవరం: పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు విడుదల చేసి, ఇతర సౌకర్యాలను కల్పించాలని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం భీమవరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఇంటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ గ్రామాల్లో పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు ఉన్నాయని, నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే పంచాయతీ కార్మికులు ఎట్లా జీవిస్తారని ప్రశ్నించారు. పంచాయతీల్లో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగం అవుతుంటే పట్టించుకోని అధికారులు పంచాయతీ కార్మికుల ఆకలితో అలమటిస్తున్న స్పందించకపోవడం దారుణమన్నారు. పంచాయతీ కార్మికులకు కావల్సింది సన్మానాలు, సత్కారాలు కావని, వేతనాలు సక్రమంగా చెల్లించాలని కోరుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం పంచాయతీ కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం ఆంజనేయులు, సిఐటియు నాయకుడు ఇంజేటి శ్రీనివాస్, పంచాయతీ కార్మికులు ఏసుబాబు, రాజబాబు, శ్రీనివాసరావు, పండు బాబు, బి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో జాతీయస్థాయి గో-కార్ట్ చాంపియన్ షిప్ పోటీలు



గోకార్ట్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: ఆటోమొబైల్ రంగంలో చోటు చేసుకుంటున్న వినూత్న మార్పులకు గో-కార్ట్ పోటీలు మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నూతన ఆలోచనలు అధ్యయనం చేసేందుకు దోహదపడతాయని పలువురు వక్తలు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులపాటు జాతీయస్థాయిలో నిర్వహించే ఎస్ఆర్‌కెఆర్ గో-కార్ట్ చాంపియన్ షిప్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ప్రపంచ ప్రగతికి ఇంజనీరింగ్ కోర్ గ్రూపులైన మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ వంటి బ్రాంచ్‌స్ ఎంతో అవసరమన్నారు. నూతన విద్యా విధానంలో చదువులకే కాకుండా ప్రాక్టికల్స్‌లో కూడా అనుభవం, అప్పటికప్పుడు నూతన టెక్నాలజీని వినియోగించుకోని విజయాలు సాధించాలన్నారు. కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ప్రిన్సిపల్ కె వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 2015 లోనే ఆటోమోటివ్ క్లబ్ ఏర్పాటు చేయడం ద్వారా గత నాలుగేళ్లుగా దేశంలో పలు ప్రాంతాల్లో జరిగిన గో-కార్ట్ చాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థులు విజయాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ కె సురేష్‌బాబు, గో కార్ట్ ఛాంపియన్‌షిప్ పోటీల కోఆర్డినేటర్ వివి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

29న పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పాలకోడేరు: స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఈ నెల 29న మండల స్థాయిలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ అభివద్ధి ప్రణాళిక 2025- 26 సంవత్సరానికి సంబంధించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.రెడ్డియ్య తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 29న ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండల స్థాయిలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, మండల పరిషత్ అభివృద్ధికి సంబంధించి మెరుగైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పురోగతి గురించి, ప్రణాళికలను సాధించడం కోసం శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తప్పక ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలియజేశారు.

గాదిరాజు బాబు కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) కుటుంబసభ్యులను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజు పరామర్శించారు. బాబు తండ్రి సోమరాజు మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు జిల్లా ఏడీ కార్యాలయం వద్ద చేనేత కార్మికుల ధర్నా

పాలకొల్లు అర్బన్: చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని, అలాగే మగ్గం ఉన్న ప్రతి నేతన్నకూ ఈ పథకాన్ని వర్తింపజేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బళ్ల చిన్న వీరభద్రరావు, కేతా గోపాలం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నేత కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని జిల్లా హ్యాండ్లూమ్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మోడిలో మురుగు ప్రవాహం



మోడి గ్రామంలో రోడ్డుపైకి వచ్చిన మురుగు నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని చూపిస్తున్న స్థానికులు

- ఇళ్ల ముందే దుర్గంధం
- ప్రబలుతున్న వ్యాధులు

కాళ్ల: మండలంలోని కలవపూడి గ్రామ పంచాయతీ పరిధిలో మోడీ గ్రామస్తులు మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తుంది. గ్రామంలోని ప్రతివీధిలో రోడ్లపై వాడకం నీరు దర్శనమిస్తుంది. దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ప్రబలి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. మురుగునీరు ప్రవహిస్తున్న ప్రాంతంలోనే మంచినీటి కుళాయి పైపు లైన్లు ఉన్నాయని, మంచినీరు కూడా కలుషితమై కనీసం వాడకానికి కూడా ఉపయోగపడటం లేదని స్థానికులు వాపోతున్నారు. మురుగునీటి సమస్యపై అధికారులు గాని, నాయకులు గాని పట్టించుకోవడంలేదని గ్రామ పెద్దలు కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు కనీసం మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లిన పాపాన కూడా పోవట్లేదని వాపోతున్నారు. దీనిపై ఇన్‌చార్జి కార్యదర్శి సతీష్‌ను వివరణ కోరగా గ్రామంలో మురుగు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం జేసీబీ ఏర్పాటు చేసి మురుగు, వాడకం నీరు బయటకు వదలకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే బ్లీచింగ్ చల్లిస్తున్నామని, దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

